

కథా కౌముది

# వివర్ణ జీవనం

శారద హరి

హైదరాబాద్ నుండి బయలుదేరి ఫ్లైట్లో గోవా కి వచ్చేసాను నేను గోవా IIIT లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నాను, ఒక్కరోజు కూడా ఉండకుండా ఆగమేఘాల మీద రావడానికి కారణం ఎలాగైనా ఈరోజు ఇల్లు చేరాలని.

ఈరోజు మా వెడ్డింగ్ యానివర్సిరీ.

అక్కగారమ్మాయి వేదిక పుట్టినరోజు పండుగకని హైదరాబాదు వెళ్ళాను. దాని పుట్టినరోజు, మా పెళ్ళిరోజు ఒక్కరోజు తేడాతో పక్కపక్కనే వచ్చాయి. అందుకే హడవిడి ప్రయాణం తప్పని సరైంది.

ఇంటికొచ్చే సరికి తెల్లవారుఝామున మూడున్నరైంది. ఎలాగూ ఈ రోజు స్పెషల్ డే కదా .. స్నానం చేసి, దేవుడికి దీపం వెలిగించి, బ్రేక్ ఫాస్ట్ కి పూరీ, పన్నీర్ కూర, పాయసం చేశాను. తొందరగా రెడి అయ్యి, నా స్పెషల్స్ రుచి చూసి, పాప స్కూల్ కి, రాజ్ ఆఫీస్ కి వెళ్ళిపోయారు.

లంచ్ కి బయటకు వెళ్దామని ప్లాన్ చేయడంతో, నేను బ్రేక్ ఫాస్ట్ చేసి సోఫాలో కూర్చున్నాను.

హైదరాబాద్ నుండి వచ్చినప్పటి నుంచి బాగా అలసటగా అనిపించింది ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియలేదు.

గాఢ నిద్రలో ఉన్నప్పుడు ఫోన్ రింగ్ అవ్వడం మొదలైంది.

మంచి నిద్రలో ఉంటే ఇప్పుడు ఫోన్ ఏంటని విసుక్కుంటూ అటువైపు 'హలో' అన్న గొంతు వినేసరికి ఎక్కడలేని ఆశ్చర్యం ముంచుకు వచ్చింది.

అదే గొంతు , నాకెంతో పరిచయమైన గొంతు! వెన్నెల కెరటాల మీదా, మల్లెపూలు నావ కదులుతున్నట్టు అందమైన గోంతూ.

"అక్కా.." అన్నాను అదిరిపడి .

"హా, నేనే ఎలా ఉన్నావ్ " అంది అక్క

"అక్కా.. నువ్వు నువ్వు..?"

"హా నేనే ఎలా ఉన్నావ్, హ్యాపీ యానివర్సరీ "

"ఏమో అక్కా.. " నీరసంగా పలికింది నా గొంతు.

అక్క నవ్వుతూ "ఏమైందే "అంటూ ఆరా తీసింది.

అక్క పెదాలపై పూసిన అందమైన నవ్వు గుర్తు రాగానే బావ గుర్తొచ్చారు.

"మీ అక్క గొంతు విన్నాక తను ఎలా ఉంటుందో చూడాలనిపించింది ,తనని చూశాక తను తప్ప ఇంక మరి ఏది కావాలనిపించలేదు" అనేవారు మా బావ.

నిజమే అక్క గొప్ప అందగత్తె.. మంచి ఎత్తు ,దానికి తగ్గ పలుచని శరీరం, స్త్రీత్వం ఉట్టిపడే పేరు కు తగ్గ 'మయూరి' మా అక్క ,పచ్చని పసుపు ఛాయ ,చూడాలనిపించే అందం మా అక్కది.,

"హైదరాబాద్ వెళ్ళాక మనసంతా బాధతో నిండిపోయింది అక్కా.. "

" ఎందుకే ఆ పీకల్లోతు దుఃఖం" అని చనువుగా అడిగింది అక్క

"వేదిక బర్త్ డే కి వెళ్ళానక్కా..".

" ఎలా ఉన్నారే వేదిక, విరాజా లు "అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది అక్క చాటు అమ్మ.

"ఓ, అక్కడ అన్ని మారిపోయాయి ,రెండు సంవత్సరాల్లో అన్ని మారిపోయాయి" ?

"వేదిక,విరాజ బావున్నారా, నా మీద ఏమైనా దిగులు పడుతున్నారా? ",అని పిల్లల మీద ప్రేమ గొంతులో పలికించింది అక్క.

"అక్కడ నీ చిన్న డాబా ఇల్లు ప్లేస్ లో నాలుగు అంతస్తులు అద్దాల మేడ వెలిసింది, విశాలమైన పోర్టికో, పడవ లాంటి రెండు పెద్ద కార్లు రెండు సర్వెంట్ రూమ్స్ ఒక పని వాడు ,ఒక వంట వాడు అక్కడ అంతా రాచరికమే ,సకల సదుపాయాలతో లగ్జరీ ఉట్టిపడే ఇల్లు"

"నీ స్థానంలో లావణ్య వచ్చి చేరింది" అన్నాను నేను.

"లావణ్య" అక్క నిదానంగా తనలో తాను మాట్లాడుకున్నట్లు గొణిగింది.

"ఏమాత్రం లావణ్యం లేని లావణ్య తన మేకప్ తో కవర్ చేయడానికి ట్రై చేస్తుందనుకో" అని నా అక్కసంత వెళ్లగక్కాను. లావణ్య 30 ఏళ్లకు కొంచెం ఇటుగా ఉంటుంది .

"పోనీలే నేను లేనప్పుడు , అవన్నీ ఆలోచించడం ఎందుకు ? పిల్లల మాట చెప్పు మధు ! " అడిగింది అక్క.

"పిల్లలు నేను వెళ్ళగానే చాలా సంతోషించి నన్ను చుట్టేసారు. ఇంటి నిండా గెస్ట్ లు. రిచ్ కమ్యూనిటీ ఫ్రెండ్స్ నాకు తెలిసిన మొహాలు ఒక్కటి లేవు అంతా హడావిడి గెస్ట్ లు ఒక్కొక్కరిగా వెళ్ళిపోయే దాకా, వేదిక విరాజలతో మాట్లాడే టైమే చిక్కలేదు అక్కా..".

ఎలా ఉన్నారని అడిగాను ‘లావణ్య ఆంటీ చాలా సపోర్టివ్, ఫ్రెండ్లీ .. ఇంతకు ముందు అమ్మ చాలా కండిషన్స్ పెట్టేది. పిన్ని అలా కాదు. అమ్మ night stays , out of hostel travels అంటే అస్సలు పంపించేది కాదు కానీ లావణ్య ఆంటీ నాన్నకు తెలియకుండా కూడా మేనేజ్ చేస్తుంది’ అంటున్నారు నీ పిల్లలు" కోపంగా చెప్పాను అక్కకి .

“ఆడపిల్లలు రెక్కలు వచ్చి రాని దశ ,వాళ్లని సరిగా కాపాడాల్సిన వయసు ,వీరాజకీ 19 ఏళ్లు ,వేదికకి 17 ఏళ్లు ఇంకా ఏది మంచో ఏది చెడు పూర్తిగా తెలియదు ,ఇప్పుడున్న సొసైటీలో బాహ్య ప్రభావాలు ఎక్కువ, మంచి కాలేజీల్లో ఇంజనీరింగ్ చదువుతున్నా ఇంకా లోక జ్ఞానం తెలియని వయసు, వాళ్లకి ఇప్పుడే అమ్మ అవసరం. ఆయన ఏమి చేస్తార్లే. ,వాళ్ళ అమ్మని మిస్ అవ్వకుండా జీవితం పట్ల ఆశలతో ఉన్నారు కదా ,పిల్లలు చేయి జారకుండా వాళ్లని నువ్వు చూసుకోవాలి “ అని దిగులుగా అంది అక్క.

“అయ్యో ! నువ్వేమి దిగులు పడకు అక్కా.. రెండు వారాలు వాళ్ళు గోవా వస్తానన్నారు నేను వాళ్ళని హ్యాండిల్ చేస్తాను, వాళ్ళ మంచి చెడు తెలుసుకునే బాధ్యత నాది , నువ్వు ధైర్యంగా ఉండు” అని అభయం ఇచ్చాను

"ఆ నాకు తెలుసు ,రోజూ ఆ వయసు పిల్లలతో డీల్ చేసే ప్రొఫెసర్ మాధురి..! నా చెల్లెలికి ,నా పిల్లల్ని ఎలా డీల్ చెయ్యాలో తెలుసు " అని రిలాక్స్ అయ్యింది అక్క.

" ఇంకా ? "నేనేం చెప్తాను అని వెయిట్ చేస్తోంది అక్క.

“ఇంకా ఏముంది.! మీ అత్తగారి దూరం బంధం అంట కొత్తకోడలు. మీ అత్తగారు తనని ఆహా ఓహో అని ఒకటే పొగడ్డం . ‘అమ్మాయ్.., మీ అక్కకి అసలు అంత అనాచారం, అందుకే ఈశ్వరుడు అనుభవించే యోగం ఇవ్వలేదు. నా కొడుకుని నిజంగానే మాయ చేసింది. నిద్రలో కూడా నా బిడ్డ మాయ మాయ అని కలవరిస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లల్ని కన్నా అదంటే వల్లమాలిన ప్రేమ నా బిడ్డకి , ఇప్పుడిప్పుడే దాన్ని మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు, లావణ్యతో ప్రేమగా ఉంటున్నాడు. కొత్త బంధాలు ఏర్పడుతున్నాయి, లావణ్య నాలుగు నెలల గర్భవతి , ఈసారైనా మా వంశం నిలబడుతుందేమో !’ అంటూ నా మొహం లో భావాల కోసం వెతికింది నీ ఛాందసపు అత్త” అని నా అక్కసంత వెళ్లగక్కాను.

" ఆ ఇల్లంతా దాని జ్ఞాపకాలే నా బిడ్డ ఏమవుతాడో అని రెండు కోట్లు పెట్టి దగ్గరుండి ఇల్లు కట్టించింది లావణ్య" మీ అత్తగారి దిగులు..!

" బాగుంది ఆంటీ,చాలా డబ్బు పెట్టి బాగా ఇల్లు కట్టించుకున్నారు, చేసే కోడల్ని కాక చేయించే కోడల్ని తెచ్చుకున్నారు”,ఈ అర్థాంతరపు సిరి కి చిదంబర రహస్యం నాకు తెలుసు అన్నట్టుగా నవ్వుతూ బదులిచ్చాను, అత్త కోడళ్ళ మొహాలు ఎర్రబడ్డాయి.

“ఇంకా నేను ఇంకా అక్కడ ఉండలేకపోయాను అక్కా.. ఆ ఇల్లు ఆ మనుషులు అంతా పరాయి వాళ్ళనిపించారు , బలవంతంగా ఏదో తిన్నాను అనిపించి బయలుదేరుతానన్నాను. నేను వద్దని వారించిన వినకుండా వాళ్ళ అంతస్తు ప్రదర్శించేలా ఖరీదైన బట్టలు పెట్టారు”. నేను వెళ్తానని క్యాబ్ బుక్ చేసుకుంటే వద్దన్నా వినకుండా బావ నన్ను ఎయిర్పోర్ట్లో డ్రాప్ చేయడానికి వచ్చారు”

"ఎలా ఉన్నారు మీ బావ? నేను లేక పిచ్చివాడైపోతాడు అని భయపడ్డాను " అని బావ మీద ప్రేమని గొంతులో పలికిస్తూ అడిగింది అక్క.

మా బావ నిజంగా అందగాడు, పెద్ద కళ్ళు, సొట్టలు పడే బుగ్గలు,నిలువెత్తు రూపం మా అక్కకి తగ్గ అందగాడు ,చూడముచ్చటైన జంట. కానీ ఎంతో ఆత్మీయంగా కనిపించే బావ నాకు పరాయిగా తోచాడు.

"ఏంటి మధు? నా మీద కోపమా ,మీ అక్కని మర్చిపోయాను అనుకుంటున్నావా ? మీ అక్కతో జంటగా ఉండడం ఎంత అలవాటైందంటే ఒంటరిగా బతక లేక పోయాను , అయినా మీ అక్కని నేను ఎప్పటికీ మర్చిపోలేను, నా మాయ ఎప్పుడు నాలోనే ఉంటుంది" అని ఏవేవో మాట్లాడుతుంటే నాకే విసుగొచ్చింది.

“ఇంకా 44 ఏళ్ళు కూడా నిండలేదని , తొందరపడి పెళ్లి చేసుకొని చిన్న వయసులో పిల్లల్ని కన్నానని ,ఎదిగిన ఆడపిల్లలు రెక్కలు వచ్చాక ఎగిరిపోతారని అమ్మ లావణ్యని నా జీవితంలోకి తెచ్చింది“ సమర్థించుకున్నారు బావ.

“మా అక్క త్యాగం ప్రేమ అన్నీ మరిచి మీ బతుకు మీరు బ్రతుకుతున్నారు మీ వ్యక్తిత్వమేమైంది అని కోపంగా అరిచి చెప్పాలనిపించింది” నాకు.

“ మాధురీ.. నువ్వు లేవు నీ పాట ఉంది అని ఎవరు నాకోసం తిలక్ గారి పాట పాడుకుంటూ అక్కడే జీవితంలో ఆగిపోరుగా ఎక్కడైనా మనిషి రీప్లేసబుల్, కొన్ని చోట్ల.. అంటే ఆఫీస్ లో రోజులు , ఇంట్లో నెలలు సంవత్సరాలు, “ అని ప్రశాంతంగా బదులిచ్చింది అక్క.

"అసలు ఆ రోజు ఏం జరిగిందక్కా?" అని ప్రశ్నించాను.

“ఏమోనే! ఒక వారం రోజుల నుండి ఎడమ చేయి అంత నొప్పిగా అనిపిస్తూనే ఉండింది హాస్పిటల్ కి వెళ్దాం అనుకుంటూనే ఆఫీస్ లో ప్రాజెక్ట్ డెలివరీ, ఇంకా పిల్లలకేమో ఎగ్జామ్స్ రెండిటి మూలంగా చాలా ఒత్తిడిగా అనిపించింది.

“ఆ రోజు నిద్ర మధ్యలో అర్థరాత్రి చాతిలో అంత నొప్పిగా అనిపించింది,కాసిన్ని నీళ్లు తాగుదామని లేచి, కొన్ని నీళ్లు తాగి రెండు అడుగులు వేసానో లేదో ఊపిరి అందనట్టుగా భారంగా అనిపించింది. నాకేమవుతుందో నాకే తెలియలేదు, మరణావస్థ అంటే ఏంటో అనుభవం లోకి వచ్చింది. అంతే !ఇంకేముంది, ఏమి మిగిలింది ? ”

అంటూ ఆగింది మా 42 ఏళ్ల అక్క,సక్రమంగా ఇల్లు నడుపుకుంటున్నా గృహిణి, పెళ్లయ్యాక చదువుకొని ప్రముఖ కార్పొరేట్ కంపెనీలో బాధ్యతగల ఉద్యోగం చేస్తున్నా ఇద్దరు పిల్లల తల్లి. అర్ధాంతరంగా అలా తనువు చాలించింది, తన సుఖమెరుగక ఒళ్ళు మరిచి కష్టపడ్డ మా అక్క ఒళ్ళు స్పందించడం మానేసింది.

Software company లో ప్రాజెక్టులు, డెడ్లైన్లు, ఇంట్లో పనులు, వంటలు ,పిల్లల బాక్సులు ,వాళ్ల చదువులు, savings, installments,investments అన్ని ఒంటి చేత్తో నిర్వహించే మా అక్క మీద కాలానికి కన్ను కొట్టింది ,అకస్మాత్తుగా తనలో కలిపేసుకుంది. రెక్కలు అరిగేంత బాధ్యతల్లో మా అక్క రెక్కలు ఒరిగాయి, పిల్లల చదువులు ,వాళ్ళని ప్రయోజకుల్ని చేయాలి అనే ఆరాటంలో కార్పొరేట్ స్కూల్స్ ,కాలేజెస్ టైం టేబుల్స్ , ఆఫీసు షెడ్యూల్స్ వాటిలో మా అక్క కొవ్వొత్తిలా కరిగిపోయింది, బాధ్యతల బరువుని మా బావ ఒక్కడి మీద మోపక తన భుజాల ని ఆసరా ఇచ్చి మోయలేని బరువు మోసి మా అక్క నిష్క్రమించింది.అక్క savings, term insurance, అన్నీ కలిపి వాళ్లకి 10 కోట్ల డబ్బులు వచ్చాయి ,వాళ్ళ అంతస్తులు మారాయి ,అనుభూతులకు నోచుకోక ,అనుభవాన్ని ఆస్వాదించే కాలం లేక మా అక్క నక్షత్రాలని చేరుకుంది , విధి చేతిలో ఓడిపోయింది .

"మనుషులంతా స్వార్థపరులు, అందరూ నిన్ను మోసం చేశారు,అక్కా. నీ బతుకు అంతా నే కాదు నీ చావులో కూడా కుటుంబానీ ఉద్ధరించావు" అని ఆవేశంగా అన్నాను.

“లేదు,లేదు, నాకు జీవించడం రాలేదు. నేను మర మనిషిని కానని, మనిషిని అని గుర్తించలేదు , నన్ను నేను అసలు ప్రేమించుకోలేదు ,లేదు ,ప్రేమించుకోవడానికి సమయం ఇవ్వలేదు. ప్రశాంతంగా కాఫీ తాగడానికి, కంటి నిండా నిద్రపోవడానికి ,కంగారు లేకుండా భోజనం తినడానికి, ఇష్టమైన ఫ్రెండ్స్ ని కలవడానికి ,బంధువులు చుట్టాలు ఇళ్లల్లో ఫంక్షన్ అటెండ్ చేయడానికి ,అసలు ఎందుకు, నా ఇష్టాయిష్టాలకి సమయం ఇవ్వలేదు నేను, అనుభూతుల్ని కూడగట్టుకోవడం ,అనుభవాలన్నీ సంపాదించుకోవడం, ఒక పద్ధతిలో ఎక్సర్సైజ్ చేసుకోవడం , హెల్త్ మానిటర్ చేసుకోవడం, నచ్చిన పనులకి, దేనికి సమయం ఇవ్వలేదు నేను. కొంతైనా నాకు నేను సమయం ఇచ్చుకుంటే నా అనుభూతుల్ని నేను కూడగట్టుకుంటే ఇంకొంత కాలం బతికేదాన్నేమో ?” అని వెక్కుతూ అంది అక్క.

“తరతరాలుగా మహిళ మారలేదు తన మనసు మారలేదు” అంది అక్క భారంగా.

“ ఇప్పుడేమంటావ్,అతివ అని రంగాల్లో పురోగమిస్తుంది కదా " అన్నా నేను అర్థం అవ్వక.

“ఆనాటి సీత నుండి నేటి ఆధునిక మహిళ వరకు త్యాగాల బరువు మోస్తూనే వచ్చారు, కట్టుబొట్టులో ఎంత ఆధునికత్వం వచ్చినా ఆలోచనలో ఆధునికత్వం రాలేదు ఇంకా , కూతురు,కోడలు,తోబుట్టువు,వదిన, ఆలీ,అమ్మ ఇలా అన్ని పాత్రలు సమర్థంగా నిర్వహించాలనే పోరాటంలో మన పాత్రని చివరగా నిలుపుకుంటాం, మన పాత్ర పోషణ లో రంగరించాలని సమాయత్తమవుతుంటే రుగ్మతగానో ,రోగంగానో ,లేదు నాకు సంభవించినట్లు మరణమై తెర

దించడం, మూట కటేయడం అంతా అయిపోతుంది, ఒకప్పుడు ఆర్థిక స్వతంత్రం లేక అణగదొక్కబడే వాళ్ళం, ఇప్పుడు అరగదీయబడుతున్నాం, అంతే తేడా!" విరక్తిగా ఉంది అక్క

స్వగతం గా ఇంకా ఇలా చెప్పుకుపోసాగింది అక్క

" నేను ఆటలో గెలవాలన్నారాటంలో ఆట ముగుస్తుందన్న విషయం మర్చిపోయాను, ఊపిరి సలపని పనుల్లో పగలు రాత్రి ఏకం చేస్తూ శాశ్వత నిద్రలోకి జారుకున్నాను, పట్టువిడుపులు నా ఉరుకుల పరుగుల జీవితంలో ప్రదర్శించక జీవితపు పట్టుకొమ్మ జారవిడిచాను .విజయపు శిఖరాల అంచు చేరాలని మృత్యులోయలోకి కూరుకు పోయాను.విలాసవంతమైన జీవితం కోసం విలువైన జీవితాన్ని కోల్పోయాను.నా శక్తికి మించి బరువులు మోసి ఖాళీ జ్ఞాపకాల సంచితో ఆకాశపు అంచుల మీద అనాసక్తంగా మిగిలాను .ఇప్పుడు జీవిత సంద్రాన్ని మృత్యువు ఒడ్డున కూర్చుని ఏరుకుందామంటే కాలాల కెరటాలు మిగిల్చిన అనుభవాల గవ్వలు,అనుభూతుల ఆల్చిప్పలు దోసిలి నిండా అయినా నింపలేకున్నాను!"

ఎవరో బెల్ కొడుతున్నా చప్పుడు .

నా జీవితం వివర్ణం అవకుండా ఉండాలంటే నేనే రంగుల అద్దుకోవాలని దిశా నిర్దేశం చేసింది మా అక్క. కల నుండి తేరుకొని, నిద్ర నుండి మేల్కొని, నా జీవితాన్ని చేజారనియను! అన్న నిశ్చయానికి వచ్చి డోర్ తీయడానికి లేచాను.

★★★

COMMENTS